
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# కేర్ టేకర్

" ట్రేసీ, వాటే ఏ సర్ప్రైజ్!" అంటూ ట్రేసీ ని గట్టిగా కౌగలించుకుంది స్మిత ఆనందం పట్టలేక.

"హే, స్మిటా.. ఈజ్ దట్ యూ, " అంటూ ఆవిడ కూడా స్మిత ని పట్టుకుంది నుదిటిన ముద్దు పెడుతూ.

" ట్రేసీ, మీరు ఇక్కడ? ఇది మీ ఇల్లా? ఫర్నిచర్ అమ్ముతున్నది మీరా? "అంది ఆశ్చర్యంగా. ఈ ఐదేళ్ళల్లోనూ దాదాపు పదేళ్ళ వయసు మీదపడినట్టనిపిస్తోంది ట్రేసీ, కానీ ముఖంలో అదే ప్రశాంతత, చిరునవ్వు.

"యా స్మిటా, నేనే, కేర్ హోం కి వెళ్ళే టైం వచ్చిందేమో అనిపిస్తోంది, అందుకే తయారీ" అందావిడ నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"వాట్, మీరు కేర్ హోం కా?" అంది స్మిత.

"తప్పదుగా" అన్నట్టు అభావంగా కళ్ళెగరేసింది ట్రేసీ.

తమ ఇంట్లో చాలా వస్తువులు అమ్మబోతున్న ఒక ప్రకటన ఇంటర్నెట్ లో చూసి అక్కడకి వచ్చింది స్మిత కూతురు వేద్య ని తీసుకుని. తీరా అక్కడకి వచ్చాకా అది తనకెంతో పరిచయమున్న ట్రేసీ ఇల్లని తెలియగానే ఒక రకమైన ఆనందం, ఇప్పుడీ విషయం తెలిసాకా, అంతలోనే చిన్న బాధా కలిగాయామెకి.

" చిన్న స్మిటా? " అంది ఆవిడ మాటలు కూడబలుక్కున్నట్టు.

'ఓ మీకింకా ఆ మాటలు గుర్తున్నాయా, యా ఇది నా కూతురు వేద్య " అంది స్మిత. చిన్న, పెద్ద ఇలాంటి మూడు నాలుగు మాటలు నేర్పించింది స్మిత ట్రేసీకి.

"వేద్య.. నేం సౌండ్స్ గుడ్" అంటూనే ' వుడ్ యూ కేర్ ఫర్ సం కాఫీ? "? అని అడిగింది ట్రేసీ. స్మిత మౌనంగా తలూపింది.

" ఐదేళ్ళయిందా మనం కలిసి? ఇన్నాళ్ళూ ఎక్కడున్నావు? ఎలా ఉన్నావు? "అని అడుగుతూనే కాఫీ మేకర్ ఆన్ చేసింది ట్రేసీ.

మెల్లిగా వంటగదంతా వ్యాపిస్తున్న కాఫీ పరిమళం. మనసుల్లో అల్లుకుంటూ, విడిపోతు అల్లిబిల్లిగా తారాట్లాడుతున్న జ్ఞాపకాలలాగా.

★★★

"మేడమ్ , ఈ బుక్ ఎక్కడుందో చెప్పగలరా? మేము ఈ మధ్యనే వచ్చాము ఇండియానించి, ఈ సిస్టంస్ అవీ మాకు తెలియడం లేదు " కొద్దిగా సిగ్గు పడుతున్నటుగా అడిగింది స్మిత అక్కడ కుర్చీలో కూర్చుని ఉన్న లైబ్రేరియన్ ని.

" నో మేడం! ప్లీజ్ కాల్ మీ, మిసెస్ బెన్నెట్ ఆర్ ట్రేసీ, ఐ యాం ట్రేసీ బెన్నెట్, " అందావిడ నవ్వుతూ.

లేత గోధుమ వర్ణపు శరీరం, చిన్నగా నవ్వే నీలికళ్ళూ, కొద్దిగా వంపు తిరిగినట్టున్న ముక్కూ, బంగారు రంగు జుట్టూ, కొద్దిగా బొద్దుగా కనిపిస్తున్న ట్రేసీని చూడగానే ఎంతో మంచిది అనిపించింది తొలిచూపులోనే, అరవై ఏళ్ళుదాటతాయేమో, అయినా చురుగ్గా ఉంది. ఆ తర్వాత ఆవిడ దగ్గరుండి లైబ్రరీ అంతా చూపించి, కావలసిన పుస్తకాలు ఎలా వెతుక్కోవాలో చూపిస్తూ, లైబ్రరీ రూల్స్ తో సహా అన్నీ చెప్పింది. ఎప్పుడేసహాయం కావాలన్నా అడగమని అందరికీ బెస్ట్ విషెస్ చెప్పి తన సీట్ కి వెళ్ళి కూర్చుంది. యూనివర్సిటీ ఆఫ్ మాసచూసెట్స్ లోని లైబ్రరీలో ఉన్నారు వాళ్ళు.

ఆంధ్రప్రదేశ్ లోని ఒక ఇంజనీరింగ్ కాలెజ్ నించి చదివి మొదటిసారి తమ దేశాన్నే కాదు తమ ఊరిని దాటి వచ్చిన ఆ నలుగురాడపిల్లలకీ ట్రేసీ ని చూస్తే ఎప్పటినించో పరిచయమున్న వ్యక్తి ని చూసినట్టనిపించింది.

కేంపస్ కి దగ్గరలోనే ఉన్న అపార్ట్మెంట్ లో ఒక చిన్న ఫ్లాట్ అద్దెకి తీసుకున్నారు నలుగురూ. అవంతి, ప్రభ, ప్రతిమ, స్మిత.

"ఇక్కడ ఇల్లంతా కార్పెట్టే, హాయిగా ఎక్కడ కావాలన్నా దిండేసుకుని పడుకోవడమే! " అంది ప్రతిమ నవ్వుతూ.

" అవునే బాబూ! రోజూ తుడుచుకోనక్కరలేదు, అదో పెద్ద పని తప్పింది కదూ, నాకసలే పని రాదూ, పని గండం కూడానూ " అంది అవంతి.

"అవునేవ్, మన బధ్ధకాలకి సరిపోయింది. సరేలెండి, ముందేదైనా తినద్దూ, ఆకలి దంచేస్తోంది" అంది ప్రభ.

నాలుగైదు రోజులయింది వాళ్ళు అక్కడకొచ్చి, అలా వస్తే అన్నీ కొంచం ముందరే తెలుసుకోవచ్చనీ ఒక కారణం, మంచిరోజని పెద్దవాళ్ళు బలవంతపెట్టి టికెట్లు కొనడం ఇంకో కారణం. ఇంకా క్లాసులు మొదలవడానికి వారం రోజులుంది. అక్కడనించే సీనియర్ విద్యార్ధులతో మాట్లాడి, మెయిల్స్ అవీ ఇచ్చి కొంత తెలుసుకున్నారు. వాళ్ళ సహాయంతోనే, నలుగురూ కలిసి ఫ్లాట్ కూడా తీసుకున్నారు.

"కొద్దిగా ముందే చెప్పి ఉంటే మా కాంప్లెక్స్ లోనే దొరికేది, పరవాలేదులెండి, ఇప్పుడు మీకు దొరికినది కూడా మాకు, కాంపస్ కీ కూడా దగ్గరే" అని సీనియర్ అమ్మాయి శ్రీలక్ష్మి ధైర్యం చెప్పడంతో దీనికి ఒప్పుకున్నారు.

ఒక బెడ్ రూమూ,, చిన్న హాల్, కిచన్, బాత్రూము. "చిన్నదేమోనే" అంది అవంతి మొదటినించీ పెద్ద ఇళ్ళల్లో ఉండే అలవాటు ఆమెకి.

" చాల్లేవే బాబూ, అన్ని పనులూ మనమే చేసుకోవాలి కదా! ఇల్లెంత చిన్నదుంటే అంత మంచిది" అంది స్మిత.

అలా మొదలైంది వాళ్ళ అమెరికావాసం, జీవితం. ఆ తర్వాత మెల్లిగా ఒక్కొక్కటే నేర్చుకున్నారు. వారానికి ఇరవై గంటలు దాటకుండా విద్యార్ధులు తమకి వీలైన ఉద్యోగాలు చేసి డబ్బు సంపాదించుకోవచ్చనీ, తమకి వీలైనట్టు కాలే జీకి వెళ్ళడాన్ని కూడా ప్లాన్ చేసుకోవచ్చనీ ఇలాంటి విషయాలన్నీ సీనియర్ల దగ్గరనించి తెలుసుకోసాగారు.

అవంతి తండ్రి హైదరాబాదులో చాలా పెద్ద బిజినెస్ మాన్. ఏ రకమైన ఉద్యోగాలూ చేసి కష్టపడక్కరలేదనీ, ఆమెకి ఎంత అవసరమైతే అంత డబ్బు తను పంపిస్తాననీ, స్నేహితులతో సరదాగా ఉంటూ, బాగా చదువుకోమని చెప్పేసాడు ఆమెకి ముందే. ప్రభ తండ్రి పెద్ద కాంట్రాక్టర్, ఆయనకి ఇలాంటి అమెరికా విషయాలేమీ తెలియవు. ప్రభ వివరాలన్నీ చెప్పేసరికి.

" నీకొకళ్ళ దగ్గర పనెందుకమ్మా, నీకేం కావాలంటే అది హాయిగా చదువుకో! ఊరికే పిచ్చి పిచ్చి పనులన్నీ సెయ్యమాక" అన్నాడు ముద్దుగా. అలా ప్రభా, అవంతిలకి నెల తిరిగేసరికి ఇంటినించి డబ్బులొచ్చేవి. ఎటొచ్చీ స్మితా, ప్రతిమా మాత్రం ఉద్యోగాలు చూసుకోవాలని నిర్ణయించుకున్నారు. తన తండ్రికి అదనపు భారం ఉండకూడదని స్మిత ఆలోచన. ప్రతిమ వాళ్ళు చాలా సాధారణ కుటుంబీకులు, అసలింత దూరం చదువుకి రాగలగడమే ఆమెకి ఎంతో గొప్ప. అందుకే తను కూడా వెంటనే ఉద్యోగం చెయ్యడానికి సిధ్ధపడింది.

తమ కాలెజీ లైబ్రరీలోనే కంప్యూటర్ విభాగంలో ఏదో ఉద్యోగం ఉందని తెలుసుకుని దానికి అప్లై చేసింది స్మిత. ఆ అమ్మాయి ఇక్కడకి వచ్చేముందే శలవుల్లో కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవడం వల్ల ఆ ఉద్యోగం ఆమెకి సులభంగానే దొరికింది. గంటకి 13 డాలర్ల చొప్పున వారానికి 20 గంటలవరకూ పని చెయ్యవచ్చు. విద్యార్ధులని అంతకంటే ఎక్కువ పని చెయ్యటానికి అనుమతించరు. అలా ట్రేసీతో రెండోసారి పరిచయం అయింది, నిజానికి తనకా ఉద్యోగం వచ్చిన సంగతి ట్రేసీయే చెప్పింది పిలిచి.

ఎంతో విశాలంగానూ, ఎన్నో పుస్తకాలతోనూ ఉండే ఆ లైబ్రరీ మొదటిసారి చూసినప్పుడే ఎంతో నచ్చింది స్మితకి. తను పనిచేసే గంటలయిపోగానే అక్కడే కూర్చుని పుస్తకాలు చదువుకుంటూ, నోట్స్ రాసుకుంటూ ఉండేది. ట్రేసీ కూడా వారానికి నలభై గంటలు అక్కడే పనిచేసేది కనక ఇద్దరి పరిచయం స్నేహంగా మారింది. ఎప్పుడూ గల గలా మాట్లాడేది ట్రేసీ.

" మాట్లాడకుండా ఉండలేని నాకు లైబ్రరీలో ఉద్యోగం, స్ట్రేంజ్ కదా" అనేది పైగా.

తరచూ స్మితని తన కార్ లో దింపేది. అమెరికా వాతావరణం గురించీ, చలికాలంలో వాళ్ళు తీసుకోవలసిన జాగ్రత్తల గురించీ అన్నీ చెప్పేది. దగ్గరలో ఉన్న షాపులకి తీసుకెళ్ళి చూపించేది. దాంతో, వారికన్నీ తొందరలోనే తెలిసాయి. ఆడపిల్లలు ఒంటరిగా ఉంటున్నారని ఎన్నో జాగ్రత్తలు చెప్పేది, చాలాసార్లు దగ్గరుండి తీసుకెళ్ళేది.

వాళ్ళ అపార్ట్మెంట్ కి రెండు ఫర్లాంగుల దూరంలో ఉంటుంది ట్రేసీ. చిన్న టవున్ హోం తనది. "అక్కడ తానొక్కర్తినే ఉంటాననీ, కూతురు బెక్కీ వేరేచోట చదువుకుంటోందనీ, అప్పుడప్పుడూ వస్తూ ఉంటుందనీ చెప్పింది. బెక్కీ నీలాగే ఉంటుంది కొంచం, ఐ మీన్ సూటిగా ఉండే కళ్ళూ, మెత్తటి బ్రౌన్ జుట్టూ, నిన్ను చూస్తే నాకెందుకో బెక్కీ, గుర్తుకువస్తుంది " అనేది స్మితని చూస్తూ.

"మా దేశాన్నించి ఎంత మంది వస్తున్నా సరే అందరిలాగే మేము కూడా ఈ దేశం కాని దేశంలో, కొత్త వాతావరణంలో ఎలా ఉంటామా?అని ఎప్పుడూ మధనపడేవాళ్ళం. మీలాంటివారు తారసపడతారని అనుకోలేదు, మీరు మాకో పెద్ద కేర్ టేకర్ ట్రేసీ! " అనేది స్మిత ఎప్పుడూ.

స్మితా, ట్రేసీ ల స్నేహాన్ని చూసి అవంతీ, ప్రభా ఏడిపించేవారు. " స్నేహానికి వయసులేదని తెలుసు కానీ మరీ ఇంత పెద్దావిడతో ఫ్రెండ్షిప్ ఏమిటే తల్లీ ? "అని అవంతి అనేది.

"ఈ గౌనులూ అవీ వేసుకుంటే వీళ్ళకెన్నేళ్ళో కూడా చెప్పలేమే బాబూ! పరవాలేదులే " అని నవ్వేది ప్రభ.

" ఆవిడ భర్త లేడా?" ప్రతిమ అడిగింది ఒకసారి.

"ఇక్కడెవరూ ఇతరుల పర్సనల్ విషయాలు అడగరు, ఐనా మనకెందుకావిడ భర్త గురించి ? " అని కోప్పడింది ప్రభ.

స్మితా, ట్రేసీల స్నేహం వల్ల మిగతావారు కూడా ట్రేసీకి దగ్గరయ్యారు, కానీ స్మిత అంటే ఎందుకో ట్రేసీకి ప్రత్యేకమైన అభిమానం.

వాళ్ళు మాస్టర్స్ రెండో సంవత్సరంలోకి రాగానే అవంతి కి వాళ్ళ అత్త కొడుకు సుశాంత్ తో పెళ్ళి అయ్యి వెళ్ళిపోయింది. " తాముండే చోట ఉన్న యూనివర్సిటీకి వీలైతే ట్రాన్స్ఫర్ చేయించుకుని అక్కడ చదువుతాను, లేకపోతే హాయిగా ఇంట్లో కూర్చుని ఎంజాయ్ చేస్తాను" అని చెప్పేసింది కూడా. అలా వాళ్ళు నలుగురు ముగ్గురయ్యారు.

ప్రతిమ కూడా స్మిత లాగే కష్టపడి చదివేది. పూర్తి చేస్తే చాలన్నట్టుగా ప్రభ చదివేది.

" థాంక్స్ గివింగ్ కి బెక్కీ వస్తోంది, మీరు ముగ్గురూ కూడా మా ఇంటికి డిన్నర్ కి రావాలి" అని ఆహ్వానించింది ట్రేసీ. బెక్కీ కూడా అచ్చు వాళ్ళ అమ్మలాగే ఉంది, తెల్లగా, బొమ్మలా. అవే నీలి కళ్ళూ, కానీ మెత్తటి బ్రవున్ జుట్టూ.

" నేను చెప్పలేదూ స్మిటా, బెక్కీ నీలాగే ఉంటుందని" అని పరిచయం చేసింది ట్రేసీ. ఎన్నిసార్లు చెప్పినా ట్రేసీ స్మిటా, ప్రటిమా అనే అంటుంది. లివింగ్ రూములో ఉన్న తన పియానో మీద రెండు మూడు పాటలు వాయించిది ట్రేసీ.

" మీరు నలుగురూ మాట్లాడుతూ ఉండండి,నేను లోపలకి వెళ్ళి డిన్నర్ ఏర్పాట్లు పూర్తి చేసి వస్తాను " అంది ట్రేసీ. బెక్కీ చూడా చాలా బాగా మాట్లాడింది, మొదటిసారి కలిసినట్టనిపించనే లేదు ఆ అమ్మాయితో మాట్లాడుతూ ఉంటే.

" ఆ పియానో మీదున్నది మీ నాన్నా? మీరిద్దరే ఉంటారా? ఆయనేరీ?" అధాట్టుగా అడిగేసింది ప్రతిమ. ఆమెని మిగేసేటట్టు చూసింది ప్రభ. అడిగింది కానీ వెంటనే చాలా గిల్టీగా ఫీలయింది ప్రభ.

వాళ్ళిద్దరి రియాక్షన్ నీ అందరికంటే ముందుగా పసిగట్టింది బెక్కీనే. " ఓ పరవాలేదు ప్రటిమా, ఇట్స్ ఓకే, ప్రభా! డాడ్ మాకిక లేరు, వీ లాస్ట్ హిం టూ కేన్సర్ త్రీ ఇయర్స్ ఎగో, హీ వజ్ ఏ వండర్ఫుల్ హజ్బెండ్ అండ్ డాడ్ యూ నో" అంది

" వీ ఆర్ సారీ రెబెక్కా, షి డిడ్ నాట్ మీన్ టూ హర్ట్ యూ" అని చెప్పబోతున్న స్మితని మధ్యలోనే ఆపి

" నో ప్రోబ్లెం స్మిటా, పరవాలేదు, నాన్న పోయాకా, అమ్మ చాలా ఒంటరిదైపోయింది, నేను వెళ్ళిపోయాకా మరీ, .   నా చదువుతో నేను బిజీగా ఉంటాను. మీ కంపెనీ తనెంతో ఎంజాయ్ చేస్తుందని నాకర్థం అయింది, ఐ యాం గ్లాడ్ మీరు దగ్గరే ఉన్నందుకు" అంది. కాసేపు ఎవ్వరూ మాట్లాడలేదు.

" గాల్స్, డిన్నర్ ఈజ్ రెడీ"  అంటూ వచ్చింది ట్రేసీ. అందరూ ఆనందంగా, నవ్వుతూ భోజనం చేశారు.

" రోజర్, నువ్వు వుండి ఉంటే ఎంతో బావుండేది, బెక్కీ ఈ సంవత్సరం గ్రాడ్యుయేట్ అవుతోంది" అని ఫోటోలో ఉన్న భర్తకి చెప్పింది. బెక్కీ ప్రేమగా అమ్మ చేతిమీద చెయ్యి వేసింది.

"ఇంక మేము వెళ్ళి వస్తాము ట్రేసీ, థాంక్ యూ వెరీ మచ్ ఫర్ ద డిన్నర్ అండ్ ఆల్ ద గుడ్ టైం బెక్కీ" అని చెప్పింది స్మిత.

" బెక్కీ ని తీసుకుని రండి మా ఇంటికి" అని చెప్పారు వాళ్ళు.

" ఈ సారి కుదరదు, రేపు గ్రానీ ని చూడటానికి కేర్ హోం కి వెళ్ళాలి, ఎల్లుండి రాత్రి నా ప్రయాణం" అంది బెక్కీ.

"గ్రానీ? " అడిగింది స్మిత.

" అవును, మా అమ్మమ్మ !" అని బెక్కీ ఏదో చెప్పబోతూ అప్పటికే ఎర్రబడిన ట్రేసీ ముఖం చూసి ఆపేసింది.

మరో రెండు వారాల తర్వాత ట్రేసీ లైబ్రరీకి రాలేదు. పుస్తకాలన్నా, గ్రంథాలయమన్నా ఎంతో అభిమానించే ట్రేసీ ఎప్పుడూ మిస్ అవడానికి ఇష్టపడదు.

"ఒంట్లో బావులేదా?" అనుకుంది స్మిత. పరీక్షల హడావిడి లో రెండు మూడు రోజులు దానిగురించి ఆలోచించే వ్యవధి లేకపోయింది. మూడోరోజు ట్రేసీ మామూలుగానే తన కుర్చీలో కూర్చుని ఉండటం చూసి హాయిగా నిట్టూర్చింది. దగ్గరకు వెళ్ళి పలకరించింది.

" హాయ్, ట్రేసీ!" అంటూ.

బదులుగా ట్రేసీ నవ్వింది.  ఎందుకో ఆమె ఎప్పటిలా లేదని గ్రహించింది స్మిత. లంచ్ టైము దాకా మాట్లాడించలేదు. " "బయటకు వెళదామా లంచ్ కి? " అని అడిగింది ట్రేసీని. ఏమనుకుందో సరేనంది ఆమె. ఇద్దరూ దగ్గరలో ఉన్న రెస్టారెంట్ కి వచ్చి కూర్చున్నాకా అడిగింది విషయమేమిటి అని.

" మై మాం పాసెడ్ అవే, అమ్మ ఇంక లేదు" అంది ట్రేసీ నెమ్మదిగా.

" ఓ,  ఐ యాం సో సారీ టూ హియర్ దిస్, ఎప్పుడు? ఎలా అయింది?"  అని అడిగింది స్మిత ఆదుర్దాగా.

" తను, నిద్రలోనే పోయిందిట, కేర్ హోం వాళ్ళు ఫోన్ చేస్తే నేను వెళ్ళాను,నిన్న బెక్కీ వచ్చింది. తను చాలా సింపుల్ ఫ్యూనరల్ కోరుకుంది, అందుకే నేనూ బెక్కీ మాత్రమే " అని ఆ పైన చెప్పలేక ఆగిపోయింది.

" ఓఅ, అలానా!, పోనీలే, ప్రశాంతమైన మరణం అందరికీ రాదు, తను చాలా అదృష్టవంతురాలు" అంది స్

"అదృష్టమా? అవునేమోలే! " అంది ట్రేసీ పొడిగా. స్మిత ఇంకేమీ మాట్లాడలేదు. మౌనంగా సలాడ్ తినసాగింది.

"నీకు తెలుసా స్మిటా, అమ్మ ఎంతో బావుండేది, అప్పుడే కోసిన మల్లెపూవులా నాజూగ్గా, అందంగా"  అంది ట్రేసీ కళ్ళు మూసుకుంటూ. ప్రతీ తల్లీ తన బిడ్డే అందమైనది అనుకోవడం ఎంత నిజమో, ప్రతీ బిడ్డా తన తల్లే అందమైనది అనుకోవడం కూడా అంతే నిజం అనుకుంది స్మిత.  తెలిసిందన్నట్టు ట్రేసీ చేతిమీద తన చెయ్యి వేసింది.

"అసలు తనెప్పుడూ కేర్ హోం కి వెళ్తుందని నేను అనుకోలేదు, పంపించాలని ఎప్పుడూ అనుకోలేదు,ఇప్పుడనిపిస్తోంది నేను చాలా స్వార్థపరురాలిని అని. నర్సింగ్ హోంల్లాగే ఉండే ఈ కేర్ హోం లంటే నాకెప్పుడూ ఇష్టం లేదు, కానీ అమ్మని ఒక్కర్తినీ ఉంచలేక, శిక్షణ పొందిన వారి దగ్గరైతే సురక్షితంగా ఉంటుందని, మధ్యలోనే ఆపింది.

" అమ్మ వాళ్ళ ఇల్లు, అదే మా ఇల్లు, ఎంత బాగుండేదో! అదే మా ఇల్లు ప్రతీ చోటూ కళాత్మకంగా ఉండేది. అమ్మా, నాన్నలకి రెండే అభిరుచులు, ఒకటి పుస్తకాలు, రెండోది వివిధ ప్రదేశాలు చూసి రావడం. మా ఇంటినిండా ఎన్నో పుస్తకాలుండేవి, అలాగే వారిద్దరూ రక రకాల చోట్లనించి సేకరించి అదే మా ఇల్లు వస్తువులూ. ఇద్దరూ చాలా నిరాడంబరమైన జీవితాన్ని గడిపేవారు, ముఖ్యమైన స్నేహితుల రాకపోకలూ, వారి వ్యాపకాలూ, నేనూ ఇంతే వారి లోకం.

నేను రోజర్ ని ఇష్టపడ్డానని చెప్పినప్పుడు వాళ్ళిద్దరూ చాలా ఆనందించారు, మనస్ఫూర్తిగా మా పెళ్ళి జరిపించారు. నా పెళ్ళిలో మా అమ్మ తెల్లటి లేస్ గౌన్, ఆలివ్ గ్రీన్ అంచు ఉన్నది వేసుకుంది, నాకింకా గుర్తు, అప్పుడే తొడిమ విచ్చిన మల్లెపూవులా ఉంది అమ్మ. దానికి తోడు అమ్మది ఎంతో స్వచ్ఛమైన నవ్వు. లేక లేక పుట్టిన తమ ఒక్కగానొక్క కూతురి పెళ్ళిలో వాళ్ళిద్దరూ ఎంత ఆనందంగా ఉన్నారో, అంత హుందాగానూ ఉన్నారు తెల్సా!

మా పెళ్ళి అయ్యాకా మేమిద్దరం రోజర్ ఉద్యోగం వల్ల ఇక్కడికి వచ్చేశాము. రెండు గంటల ప్రయాణమే మాకూ, అమ్మావాళ్ళుండే స్ప్రింగ్ ఫీల్డ్స్ కి. హాలిడే దొరికినప్పుడల్లా చూడటానికి వెళ్తూనే ఉండేవాళ్ళము.

ఒక రోజు అమ్మ దగ్గరనించి ఫోన్ కాల్ " నాన్న ఏదోలా ఉన్నారు రాత్రినించీ, నువ్వైనా, రోజర్ అయినా ఒకసారి రాగలరా?" అని. వీకెండ్ కావడంతో ఇద్దరమూ వెళ్ళాము, నాన్నని చూస్తూనే రోజర్ కి అర్థం అయింది తనకి స్ట్రోక్ వచ్చిందని, ట్రీట్మెంట్ ఇచ్చినా లాభం లేకపోయింది. ఆ ఆదివారం నాడే నాన్న మాకు దూరం అయ్యారు.

ఆయన పోయిన తర్వాత అమ్మ ఒక్కర్తే అక్కడ ఉండేది, తన పుస్తకాలు చదువుకుంటూ, తన కార్ తానే డ్రైవ్ చేసుకుంటూ ఉండేది. కానీ మెల్లిగా అమ్మ చురుకుదనం తగ్గడం మొదలయింది అని మాకు అర్థం అయింది. అంత పెద్ద ఇంటిని ఒక్కర్తీ చూసుకోలేక పోయేది. అలాగే కార్ నడిపేటప్పుడు చిన్న చిన్న తప్పులు చెయ్యడం మొదలుపెట్టింది. అలాంటి పరిస్థితుల్లో తనని ఒక్కర్తినీ ఉంచడం మంచిది కాదని నాకూ, రోజర్ కి పదే పదే అనిపించసాగింది. మాతో రమ్మంటే తను ఒప్పుకునేది కాదు, ఆ ఇల్లన్నా, ఆ ఇంట్లోని వస్తువులన్నా ఆమెకి ప్రాణం. పైగా తన పనులన్నీ తానే చేసుకోవడంలోని ఆనందం ఆమెకెంతో ముఖ్యం. క్లీనర్ ని పెట్టినప్పుడు కూడా తనకి నచ్చలేదు. మా కేమో ఉద్యోగాలూ, బెక్కీ స్కూల్ వదిలి అక్కడికి మారిపోయే పరిస్థితి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియక చాలా సతమతమయ్యాము.

చివరికి నేనే ఒకరోజు తెగించి అమ్మకి చెప్పాను, అక్కడ ఇల్లు అమ్మేసి మా ఇంటికి మారిపోదామని. ముందు తను ఒప్పుకోలేదు, కానీ నేనూ, రోజర్ చెప్పగా, చెప్పగా చివరికి సరే అంది. ఆ ఇంట్లోనించి తనకి కావలసిన అతి ముఖ్యమైన వస్తువులు మాత్రమే తెచ్చినా సరే మా నాలుగు బెడ్ రూము ల ఇల్లు అకస్మాత్తుగా నిండిపోయినట్టనిపించింది.

ఆవిడని ఇక్కడికి తీసుకువచ్చి ఒక పెద్ద సమస్య పరిష్కరించాము అనుకున్నాము కానీ, దాని వల్ల ఎదురయ్యే కొత్త సమస్యలని అస్సలు ఊహించలేదు. దాదాపు ఆరునెలలైనా కొత్త పరిసరాలకు అలవాటు పడలేదు అమ్మ. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్టుగా ఉండేది, ఆలోచిస్తూ కూర్చునేది. ఆమె అన్నింటికంటే మిస్ అయ్యేది డ్రైవింగ్, ప్రతీ దానికీ నా మీదా, రోజర్ మీదా ఆధార పడటం తనకి నచ్చేది కాదు. తనది కాదు అనుకున్న చోట రోజంతా ఒంటరిగా ఉండటం ఆమెకి మరింత ఇబ్బందిగా ఉండేది. అక్కడిలాగే ఇక్కడ కూడా ఏ పని కావాలంటే అవి చేసుకోమంటే ఎందుకో చేసుకోలేకపోయేది. అక్కడ చాలా కాలంగా ఉండటం వల్లనూ, కొద్దిగా చిన్న ఊరవ్వడంవల్లనూ ఆమెకి నలుగురైదుగురు ముఖ్యమైన స్నేహితురాళ్ళుండేవారు. వాళ్ళందరూ వారానికి రెండు సార్లు క్రమం తప్పకుండా సాయంత్రం టీ వేళకి కలిసేవారు. అందరూ కలిసి కార్డ్స్ ఆడుకోవడం, లేదా కొత్త లేసు అల్లికలు నేర్చుకోవడం, అదీ కాదంటే కబుర్లు చెప్పుకోవడం చేసేవారు. అది అమ్మ చాలా మిస్ అయ్యేది. ఇలాంటి సమస్యల వల్ల క్రమంగా శారీరికంగానూ, మానసికంగానూ కూడా బలహీనమైపోయింది.

అప్పుడు తగిలింది మాకు మరొక దెబ్బ రోజర్ కి కేన్సర్ అని! మేము తనకి చెప్పలేదు. తనున్న పరిస్థుతుల్లో అది అప్పుడే చెప్పడం మంచిది కాదు, అనుకున్నాము. రోజర్ ట్రీట్మెంట్, బెక్కీ చదువు, ఇంటి పనీ, ఇంటి మీదున్న అప్పూ ఇవన్నీ చేరి నా సహనాన్నీ, ప్రశాంతతనీ మెల్లిగా హరించడం మొదలుపెట్టాయి. అమ్మకి ముందు కేటాయించినంత సమయం ఇవ్వలేకపోయేదాన్ని.

అలాంటప్పుడే ఒక స్నేహితురాలు చెప్పిన ఆలోచనతో తనని కేర్ హోం లో చేర్పించాను. నిజానికి అక్కడకి వెళ్ళడం తనకీ ఇష్టం లేదు, పంపడం నాకూ ఇష్టం లేదు. రోజర్ అయితే పెద్ద యుద్ధమే చేశాడారోజు. కానీ ఇక్కడ ఉంటే ఈ పరిస్థితులన్నీ తనని మరింత ఇబ్బంది పెడతాయని నేను అలా ప్రవర్తించాను, పైగా నా ఉద్యోగం మానుకుని ఇద్దరినీ చూసుకునే వీలు లేదు. రోజర్ ట్రీట్మెంట్ కి ఎంతో ఖర్చు అయ్యేది. మేము మా పెద్ద ఇల్లు అమ్మేసి ఇదిగో ఇప్పుడుంటున్న ఈ చిన్న ఇల్లు కొనుక్కుని ఇక్కడికి మారాల్సి వచ్చింది. అప్పుడే మావీ, అమ్మవీ కూడా చాలా సామాను అమ్మేయవలసి వచ్చింది కూడా. అలా పరిస్థితులన్నీ మా చేతిలోంచి జారిపోయాయి.

ఇవన్నీ అమ్మకి తెలిస్తే మరింత బాధపడుతుందని కొన్ని చెప్పలేదు. ఆవిడకి బాగా ఇష్టమైన పెయింటింగ్స్, ఇతర వస్తువులు కొన్నీ తీసుకెళ్ళి తన రూములో పెట్టాను. హాస్పటల్ ని గుర్తుకు తెచ్చే ఆ హోం లో అమ్మ ఇమడలేకపోయిందనే చెప్పాలి, అక్కడ నర్స్ లూ, ఇతర ఉద్యోగులూ ఎంత బాగా చూసినా ఆమెలో ఏదో అసంతృప్తి, నా మనసులో వెలితిలాగే.

చికిత్సకి స్పందిస్తున్నాడు, తొందరలోనే కోలుకుంటాడు అని డాక్టర్లు చెప్తూ ఉండడంతో, రోజర్ కోలుకోగానే అమ్మని తీసుకురావాలని అనుకున్నాము తను కానీ కోలుకోలెదు. రోజర్ దూరమయ్యాకా శారీరకంగానూ, మానసికంగా నూ కృంగిపోయిన నేను ఆ సమయంలో అమ్మని అస్సలు తీసుకురాలేకపోయాను. ఆ తర్వాత అమ్మ ఆరోగ్యం బాగా క్షీణించడంతో వాళ్ళు కూడా అక్కడే ఉంటే మంచిదని చెప్పారు, అలా అమ్మ అక్కడే.." అని ఆగిపోయింది.

అప్పటికే ట్రేసీ ముఖం ఎర్రబడిపోయింది, కన్నీళ్ళు ఆపుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తోంది.

" పరిస్థితులే తప్ప నేను స్వార్ధపరురాలిని కాదు స్మితా!" అంది బాధగా.

"నేను అర్ధం చేసుకోగలను ట్రేసీ. ఊరుకోండి " అంది స్మిత అనునయంగా.

★★★

గతమంతా గిర్రున తిరిగి కళ్ళ ముందాగింది స్మిత కి. " కాఫీ" అన్న ట్రేసీ మాట విన్నాకా.

ఇద్దరూ మౌనంగా కాఫీ తాగుతున్నారు. ఫ్రిజ్ లోంచి హెర్షీస్ చాకోలెట్ తీసి వేద్య చేతిలో పెట్టింది ట్రేసీ.

"ఏం ఆలోచిస్తున్నావు? పాత రోజులగురించా? ఇప్పుడు నీగురించి చెప్పు? ఎలా ఉన్నావు? ఇన్నాళ్ళూ ఎక్కడున్నావు? మీ స్నేహితులెలా ఉన్నారు?" అంది ట్రేసీ.

"బానే ఉన్నాము ట్రేసీ, అందరూ బానే ఉన్నాము, మిగతా విషయాలు తర్వాత, ముందు, మీకో మాట చెప్పనా?, మీరేమీ అనుకోరుగా! " అంది స్మిత.

"చెప్పు స్మితా, నా దగ్గర నీకు భయమేమిటి? ఎప్పుడూ చెప్పేదాన్ని కదా నీకు, నాకు బెక్కీ ఎంతో, నువ్వూ అంతే " అంది ట్రేసీ నవ్వుతూ.

" నాతో మా ఇంటికి వచ్చేస్తారా? వై షుడ్ యూ గో టూ అ కేర్ హోం? లెట్ మీ బీ యువర్ కేర్ టేకర్ నౌ" అంది స్మిత ఉద్వేగంగా.

పక పకా నవ్వింది ట్రేసీ. " నీతోనా? తప్పకుండా! బెక్కీ కూడా ఇదే అంది, తన ముగ్గురు పిల్లలతోనూ, ఉద్యోగంతోనూ, ఎంత కష్టపడుతోందో నాకు తెలుసు, అందుకే నేను తనని కష్టపెట్టదలుచుకోలేదు. డ్రైవింగ్ బాగానే చేస్తున్నాను, పనులు కూడా మర్చిపోవడంలేదు

కూడా, కేర్ హోం కి ఇప్పుడే వెళ్ళనులే, మెంటల్ గా ప్రిపేర్ అవుతున్నాను, లేకపోతే మా అమ్మలా అయిపోతానేమో అని, నవ్వుతూ అన్నా తన అమ్మ ప్రసక్తి రాగానే ఆమె గొంతు సన్నగా ఒణికింది.

" జోక్ కాదు ట్రేసీ, ఐ యాం సీరియస్!, " అంది స్మిత.

" పిచ్చి పిల్లా! ఎలా కలిసిందో మనకీ స్నేహం? అని తల్చుకుంటే నాకిప్పటికీ ఆశ్చర్యమే, ఒక యూనివర్సిటీలో లైబ్రేరియన్ గా కొన్ని లక్షలమంది విద్యార్థులని చూశాను, అందులో కొన్ని వేలమంది ఇండియన్స్ కూడా ఉండి ఉంటారు. కొందరు నీ కంటే ముందు లైబ్రరీలోనూ పనిచేశారు స్టూడెంట్ జాబ్ లమీద. వారెవ్వరితోనూ కలవని బంధం నీతో మాత్రమే ఎందుకు కలిసింది? అంటే నా దగ్గర జవాబు లేదు. ఇన్నేళ్ళయినా నువ్వు నన్ను, నేను నిన్నూ మర్చిపోలేదు, అంటే చూడు మనదెంత గొప్ప రిలేషనో. దాన్నిలాగే ఉండనిద్దాం, మరే ఇతర ఏమోషన్స్ నీ కలిపి కన్ఫ్యూజ్ చెయ్యద్దు. నాకు తెలుసు, ఈ సువిశాల అమెరికా భూభాగంలో, ఐ హావ్ టూ డాటర్స్, ఎప్పుడవసరం అయినా పిలుస్తాను సరేనా! ఇప్పుడు మాత్రం నా ముందు అవసరాలకి సన్నాహం చేసుకుంటున్నాను" అంతే అంది నవ్వుతూ.

ఎన్ని రకాలుగా చెప్పినా ట్రేసీ ఒప్పుకోలేదు. " నాకున్న సేవింగ్స్ చాలు, పైగా ఈ అక్కరలేని వస్తువులూ, ఆ తర్వాత ఇల్లూ అమ్మేస్తాను. ఆ డబ్బులూ చాలూ నన్ను నేను చివరివరకూ ఫండ్ చేసుకోవడానికి. చిన్న అపార్ట్మెంట్ రెంట్ కి తీసుకుంటున్నాను, బెక్కీ వస్తూ ఉంటుంది, ఇప్పుడు నీకు నేనెక్కడున్నానో తెలుసు కనక నువ్వు కూడా వేద్య ని తీసుకుని వస్తూ ఉండు. అది చాలు నాకు. వారానికి రెండు రోజులు సర్వీస్ చెయ్యడానికి వెళ్తాను. ఇంకా ఓపిక ఉంది.

ఇంకో విషయం చెప్పనా? మీరొచ్చిన కొత్తలో నువ్వెప్పుడూ అనేదానివి కద, నేను మీకు కేర్ టేకర్ ని అని. మీ నలుగురికి నేను ఒక్కదాన్నే, ఇప్పుడు నాకు మీరందరూ కేర్ టేకర్లే, ఒక్క ఫోన్ చేస్తే చాలు కదా! ఆ ధైర్యం చాలు, నన్ను మరెన్నో ఏళ్ళు నడిపించడానికి. భయపడకు, దయచేసి, నన్ను బలవంతపెట్టద్దు. నీకిష్టమైన ఫర్నిచర్, వస్తువులూ అన్నీ తీసుకో " అంది.

ఆమె అమ్ముతున్న మంచాలూ, టీవీలు, సోఫాలూ అన్నింటికీ కలిపి చెక్ రాసి ఇవ్వడం తప్ప మరేమీ చెయ్యలేకపోయింది స్మిత.

" ఇదేమిటి ఇంత ఫర్నిచర్ ఎందుకు తీసుకున్నావ్? ఎప్పుడు తీసుకున్నావ్?" అడిగాడు భర్త టూర్ నించి వస్తూనే.

"నీకు చెప్పాను కదా ట్రేసీ గురించి, ఆవిడ సామాన్లకి కేర్ టేకర్ ని అయినా సంతోషమే " అని తీసుకున్నాను అంది నెమ్మదిగా.

Click here to share your comments on this story